క్లుప్తంగా

ఉదండాపూర్‌లో కొనసాగుతున్న రీసర్వే



జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ గ్రామంలో సోమవారం రీసర్వేను అధికారులు కొనసాగించారు. జిల్లా నుంచి వచ్చిన మొత్తం 11 బృందాలు ఇంటింటికెళ్లి వివరాలు సేకరించారు. స్థానిక తహసీల్దార్ నర్సింగరావు సర్వేను పరిశీలించారు. మరో మూడు, నాలుగురోజుల పాటు సర్వే కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

యూరియా కోసం పడిగాపులు



మిడ్జిల్: రైతన్నలు యూరియా కోసం సోమవారం పడిగాపులు కాశారు. స్థానిక సహకార సంఘానికి నిత్యం ఒక లారీ యూరియా వస్తున్నా రైతులకు ఏమాత్రం సరిపోవడం లేదు. మండలంలో రైతులు కేఎల్ఐ కాల్వ కింద వరి, మొక్కజొన్నను అధికంగా సాగు చేశారు. పంటల సాగు పెరగడంతో యూరియా వినియోగం పెరిగింది. దీంతో రైతులకు యూరియా కష్టాలు నెలకొన్నాయి. యూరియా కోసం కార్యాలయం దగ్గర గంటల తరబడి రైతులు నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లా అధికారులు రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని అధిక మొత్తంలో యూరియాను సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి



అడ్డాకుల: హెచ్‌బీఎల్ కంపెనీ తరుపున అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆకంపెనీ ప్రతినిధి యాదగిరిరెడ్డి తెలిపారు. సోమవారం మూసాపేట మండలం జానంపేటలో 12 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన పిల్లలకు కల్చరల్, ఫిజికల్ ఈవెంట్లను నిర్వహించారు. మూసాపేట, జానంపేట, చక్రాపూర్, వేముల, తాళ్లగడ్డ, కనకాపూర్, అచ్చాయపల్లికి చెందిన 12 అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకొని ప్రతిరోజు పిల్లలకు పాలు, అరటి పండ్లు, మిల్లెట్ చెక్కీలను హెచ్‌బీఎల్ కంపెనీ తరపున అందిస్తున్నారు. జానంపేట ప్రాథమిక పాఠశాల వద్ద భగీరథ బాలల వికాస కేంద్రం 16వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుశీల, పంచాయతీ కార్యదర్శి మాధవి, కంపెనీ ఉద్యోగి వన్నం లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

గోశాలకు గోవుల తరలింపు



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మపూరం కురుమూర్తి స్వామికి భక్తులు కానుకలుగా సమర్పించిన నాలుగు గోవులను ఆలయ సిబ్బంది సోమవారం హన్వాడ మండలం చిన్నదర్పల్లి గ్రామ గోశాలకు ఆటోలో తరలించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది శివానందచారి, శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గోవుల సంరక్షణకు చిన్నదర్పల్లి గోశాలకు తరలించామన్నారు. ఆలయ కమిటీ మెంబర్ బాదం వెంకటేశ్వర్లు, భక్తులు బాల్‌రాజు, అర్చకులు శ్రీనివాసులు, నాగరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పశువుల కంటెయినర్ పట్టివేత

అడ్డాకుల: అనుమతుల్లేకుండా పశువులను తరలిస్తున్న కంటెయినర్ లారీని అడ్డాకుల పోలీసులు పట్టుకున్నారు. సోమవారం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులకు హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాకు పశువులను తరలిస్తున్న లారీ పట్టుబడింది. అందులో సుమారు 35 పశువులున్నాయి. విచారించిన పోలీసులు పశువుల తరలింపునకు ఎలాంటి అనుమతి లేకపోవడంతో వాటిని అదే కంటెయినర్ లారీలో వెల్దండ వద్ద ఉన్న గోశాలకు తరలించారు. కంటెయినర్ డ్రైవర్, యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

శివాలయాలు ముస్తాబు

- నేటి నుంచి భాగ్యేశ్వర, శివగిరి, చలమేశ్వరాలయాల్లో ఉత్సవాలు
- ప్రతి శివాలయానికి ఓ ప్రత్యేకత
- శివరాత్రి జాగరణకు రానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు



కోడ్గల్ నచికేత శివాలయం

జడ్చర్ల టౌన్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు వేడుకల కోసం ముస్తాబయ్యాయి. మండలంలోని పురాతన, ప్రసిద్ధి గాంచిన శివాలయాలు అనేకం ఉండగా వాటన్నింటిలోనూ శివరాత్రి సందర్భంగా నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున శివపార్వతుల కల్యాణోత్సవాలు, హోమాలు, అభిషేకాలు చేసేందుకు ఆలయ కమిటీలే ఏర్పాట్లుచేశాయి.

నచికేత తపోవన శివాలయం

కోడ్గల్ పంచాయతీ పరిధిలోని నచికేత తపోవనంలోనూ శివాలయం భక్తులను ఆకట్టుకునేలా నిర్మించారు. ఇక్కడి ఆలయంలో శివరాత్రి జాగరణ వైభవంగా జరుగుతుంది. ఆలయంలో భారీ శివలింగం భక్తులను ఆకట్టుకునేలా ప్రతిష్ఠించారు. హైదరాబాద్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో జాగరణ వేడుకలకు రానున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో

పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలోని జ్ఞాన సరస్వతి దేవాలయంలోని పరమేశ్వరి స్వామి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం చేయనున్నారు.

■ బాదేపల్లి పట్టణ శివారులో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన త్రిలింగేశ్వరాలయం, వెయ్యేళ్ల నాటి కావేరమ్మపేట శివాలయం, వేంకటేశ్వర స్వామి ఆలయం పక్కనున్న శివాలయం, సకలదేవతల్లోని శివాలయం, గాంధీనగర్ ట్రస్టులోని కాశీవిశ్వనాథ ఆలయం, మండలంలోని ఆయా ప్రాంతాల్లోని శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు జరిపించనున్నారు.

భాగ్యేశ్వరాలయం

బాదేపల్లి పట్టణం పాతబజార్‌లో భాగ్యమ్మ అనే బ్రాహ్మణ మహిళ 155ఏళ్లక్రితం కాశినుంచి శివలింగాన్ని తెచ్చి ప్రతిష్ఠించింది. ఈ కారణంగా ఆలయం భాగ్యేశ్వరాలయంగా ప్రసిద్ధి గాంచింది. ఆలయంలో శివుడికి అభిషేకం జరిపించిన నీటితో చర్మవ్యాధులు నయమవుతాయని ఆలయ ధర్మకర్త భార్గవ శర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు, శివపార్వతుల కల్యాణం జరిపించనున్నారు.



పంచలింగాల క్షేత్రం శివగిరి



మండలంలోని బండ మీదిపల్లి గ్రామశివారులో 44వ నంబర్ జాతీయ రహదారికి 2కి.మీ దూరంలో ఉంది. ఆలయంలో ప్రతిష్ఠించిన ఐదు లింగాల్లో మూలవిరాట్ మధ్యప్రదేశ్ నర్మదా నదీతీరం నుంచి, గణపతి లింగం యూపీ సోనభద్ర నదీతీరం నుంచి, శక్తిలింగం ఏపీ స్వర్ణముఖి నదినుంచి, విష్ణులింగం నేపాల్ గండకానది, సూర్యలింగం కర్నాటక కావేరి నదీతీరాల నుంచి తెచ్చారు. ఆలయం వద్ద ఏకశిలా రూపంలో ప్రతిష్ఠించిన వినాయకుడు, అంజనేయ స్వామి విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

చలమేశ్వర ఆలయం



జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిలో మంగళికుంటతండా వద్ద ఉన్న చలమేశ్వరాలయంలో ప్రతిష్ఠించిన శివలింగానికి నిలువు నామాలు ఉండటం ప్రత్యేకత. పూర్వం పరశురాముడు ప్రతిష్ఠించిన శివలింగాలకు మాత్రమే నిలువు నామాలున్నాయని ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయం వెనకాల ఉన్న చలమలో వేసవిలోనూ నీళ్లు ఉండటం ఇక్కడ ప్రత్యేకత. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

పరీక్షలకు సిద్ధం కండి

- డీఈఓ ప్రవీణ్‌కుమార్



రాజాపూర్: పదో తరగతి విద్యార్థినులు పరీక్షలకు సిద్ధం కావాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం రాజాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన తనిఖీచేశారు. ముందుగా పదో తరగతి విద్యార్థినులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని రోజుల క్రితం పాఠశాలలో చోటుచేసుకున్న విషయాలపై ఆరాతీశారు. పాఠశాలలోనే ఒక ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటుచేస్తానని, దాన్ని తానే స్వయంగా పరిశీలిస్తానని వారికి సూచించారు. పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయించాలని, రెగ్యులర్ ఏఎన్ఎంను నియమించాలని విద్యార్థినులు డీఈఓను కోరారు. చిన్నచిన్న లోపాలను సరిచేసుకొని ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో బయటి వ్యక్తులను లోపలికి అనుమతి ఇవ్వవద్దని ఉపాధ్యాయులకు హెచ్చరించారు. ఎంఈఓ సుధాకర్, ఉపాధ్యాయుడు ఎల్లయ్య ఉన్నారు.

చలువ పందిరి ఏర్పాటు

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని మహ శివరాత్రి కోసం ముస్తాబు చేశారు. ఈనెల 26న జరగనున్న శివరాత్రికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం చలువ పందిరిని ఏర్పాటు చేశారు. రాత్రికి ఆలయం వద్ద భక్తులు జాగరణ చేయనున్న క్రమంలో వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఆలయం వద్ద చేస్తున్న ఏర్పాట్లను సోమవారం భూత్పూర్ సీఐ రామకృష్ణ పరిశీలించారు. భద్రతా పరంగా చేపట్టాల్సిన చర్యలపై ఎస్ఐ శ్రీనివాస్‌తో చర్చించి పలు సూచనలు చేశారు. ఈఓ రాజేశ్వరశర్మ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి, దామోదర్‌రెడ్డి ఉన్నారు.

'యుద్ధభేరి' పోస్టర్ విడుదల

నవాబుపేట: సీపీఎస్ విధానం రద్దు చేయాలనే డిమాండ్‌తో వచ్చే నెల 2న హైదరాబాద్‌లో జరిగే 'యుద్ధభేరి' పోస్టర్‌ను మండల అధికారులు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ రద్దుకమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసే దాకా పోరాటం చేస్తామని అన్నారు. ఎంపీడీఓ జయరాం నాయక్, ఉద్యోగ సంఘాల నాయకులు గోపాల్, అంజనేయులు, బద్రునాయక్ ఉన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని, ఈ దోపిడీని అరికట్టాలంటూ సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో ఏడీ అనురాధకి వినతిపత్రం అందజేశారు. గల్లీగల్లీకి టెక్నో, మాడల్‌స్కూల్ పేర్లతో బడులు నిర్వహిస్తున్నారని, ఒక్కపాఠశాలకు అనుమతి తీసుకొని సబ్‌క్యాంపస్‌లను నడుపుతున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాస్కర్, చంద్రశేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.

సంఘటితమైతేనే సమస్యలు పరిష్కారం

స్టేషన్ మహబూబ్‌నగర్: విశ్రాంత ఉద్యోగులు సంఘటితమైతేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఫోరం కార్యాలయంలో జరిగిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్ల క్రితం రిటైర్డ్ అయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన లివ్ ఎన్ క్యాష్‌మెంట్ బకాయిలు, 2017 పీఆర్‌సీకి సంబంధించిన బకాయిలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. డైరీ డెవలప్‌మెంట్ రిటైర్డ్ అధికారి యాదయ్య, రంగినేని మన్మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, భగవంతు, జీబీ.పాల్, నాగాంజనేయులు, ఆర్.నారాయణ, బి.మోహన్‌రెడ్డి, నస్కంటి నాగభూషణం, భీమమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిన్నచింతకుంట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని లాల్‌కోట జెడ్పీహెచ్ఎస్ ఎన్జీసీ(నేషనల్ గ్రీన్ కార్ప్స్) ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు శివకుమార్ అన్నారు. సోమవారం ఆ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ, విద్యా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ కార్ప్స్, తెలంగాణ గ్రీన్ కార్ప్స్ వారి నిర్వహణలో భాగంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. దీంతో పాఠశాలలో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు గంగయ్య, రాజశేఖర్, శ్రీనివాసులు, రాఘవేందర్, సుజాతమ్మ, జయలక్ష్మి, సుమన పాల్గొన్నారు.

పాఠశాల మూసివేయాలని ఆదేశం

- నోటీస్ అందజేసిన ఎంఈఓ

మహమ్మదాబాద్: పాఠశాలలో కనీస వసతుల్లేకుండా, అనుమతులు కూడా లేని కారణంగా వచ్చే ఏడాది నుంచి పాఠశాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఈమేరకు ఎంఈఓ సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్‌కు సోమవారం నోటీస్ అందజేశారు. మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి గేట్ సమీపంలో నేషనల్ హైవేను అనుకొని న్యూబ్రిలియంట్ గ్రామర్ స్కూల్ ప్రైవేటు పాఠశాల ఉంది. ఎనిమిదో తరగతికి అనుమతి లేదని, ఆటస్థలం లేదని, ఫీజు చార్టులు లేవని గతంలోనే పలువురు ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించగా నివేదిక అధికారులు పంపారు. పాఠశాలను వచ్చే ఏడాది నుంచి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆర్జేడీ ఆదేశించారు. దీంతో ఎంఈఓ రాజునాయక్ ప్రిన్సిపాల్ దేవేందర్‌కు నోటీసు అందజేశారు.



నోటీస్ అందజేస్తున్న ఎంఈఓ రాజునాయక్

బీజేపీ పాలనలో దళితుల జీవితాలు దుర్భరం



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

మహబూబ్‌నగర్ రూరల్: కేంద్రంలోని బీజేపీ పాలనలో దళితుల జీవితాలు దుర్భరంగా మారాయని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను చ ర్చించడానికి మార్చి 2, 3వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సమావేశాలు ఉంటా యని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి నేటితరం సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర స్థాయి సమావేశాలను మార్చి 2న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ ప్రారంభిస్తారని, రాష్ట్ర నలుమూలల నుండి రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ సెమినార్‌లో యువకులు, విద్యార్థులు, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎం.కుర్మయ్య, నాయకులు మనోహర్, ప్రవీణ్, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్వీఎస్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎంఈఓ శంకర్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో, పాఠశాలల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాల్నారు. దంత సమస్యలున్న విద్యార్థులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు.

అభివృద్ధి పనులపై సీఆర్ఎం సభ్యుడి ఆరా



శేరిపల్లి (హెచ్)లో అధికారులు, మహిళా సంఘాల సభ్యులతో సీఆర్ఎం సభ్యుడు ఎస్‌సీ పాల్

భూత్పూర్/ అడ్డాకుల: భూత్పూర్ మండలంలోని శేరిపల్లి(హెచ్)లో, మూసాపేట మండలం తిమ్మాపూర్‌లో సోమవారం కామన్ రివ్యూ మిషన్(సీఆర్ఎం) సభ్యుడు, ఎస్‌సి పాల్ జాతీయ ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులు, పంచాయతీలో అభివృద్ధిపై అధికారులతో ఆరా తీశారు. శేరిపల్లి(హెచ్)లో ఉపాధి హామీ ద్వారా నిర్మించిన పంచాయతీ భవనం, మహిళా సంఘంలో ఏఏ పనుల నిమిత్తం రుణాలు తీసుకున్నారు, తిరిగి చెల్లించడం, లాభాలు ఆర్జిస్తున్నారా అన్న అంశాలను మహిళాసంఘాల సభ్యులను ఆయన అడిగి తెలుసుకున్నారు. తిమ్మాపూర్‌లో ఈజీఎస్‌లో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి మొక్కల పెంపకంపై ఆరాతీశారు. అదేవిధంగా రోడ్డు పక్కన నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కల సంరక్షణ గురించి వాకబు చేశారు. ఈజీఎస్ ద్వారా నిర్మించిన పశువుల షెడ్‌ను పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడారు. షెడ్డు నిర్మాణానికి నిధులు ఏ విధంగా విడుదల చేశారనే దానిపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఆర్‌డీ అధికారి కృష్ణమూర్తి, డీఆర్‌డీఓ నర్సింహులు, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓలు ప్రభాకర్, కృష్ణయ్య, ఏపీడీ మంజుల, ఎంపీఓ అనురాధ, ఏపీఓ పులేందర్, ఏపీఎం చారి, ఎంపీఓ శ్రీదేవి, ఏపీఓ విమల, ఏఈ పీఆర్ స్వామి, ఏపీఎం హైమావతి, ఉపాధి హామీ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన రిజిస్ట్రార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలో పీజీ సెమిస్టర్–3 పరీక్షలు కొనసాగుతన్నాయి. ఈమేరకు పీయూ పీజీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్ చెన్నప్ప సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు చూచిరాతలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి, అనురాధారెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణికి నాలుగు అర్జీలు

జడ్చర్ల టౌన్: మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నాలుగు దరఖాస్తులు అందాయి. వాటిలో మూడు రెవెన్యూ, ఒకటి మున్సిపాలిటీకి సంబంధించిన అర్జీ ఉంది. తహసీల్దార్ నర్సింగ్‌రావు, ఎంపీడీఓ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

నవాబుపేట: గ్రామాల్లో 'ఉపాధి' పనులకు వచ్చే కూలీల సంఖ్యను ఇంకా పెంచాలని ఎంపీడీఓ జయరాంనాయక్, ఏపీఓ జ్యోతి ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో రైతులకు అవసరమైన పనులను మొదటి ప్రాధాన్యతగా చేపట్టాలని అన్నారు. కూలీలు పనులకు వచ్చేలా పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి సిబ్బంది సైతం పనుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా అడిగిన వారందరికీ పని చూపించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవాబుపేట: మండలంలోని సిద్దోటం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. వివరాలు.. కారుకొండ శివారులోని ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి ఓ ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తీసుకు వస్తుంది. సమాచారం రావటంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జడ్చర్ల మండలం కిష్టారం గ్రామానికి చెందిన డ్రైవర్ యాదయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను రవాణాను చేస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

'రైతు భరోసా'ను ఖాతాల్లో జమచేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): 'రైతు భరోసా'ను రైతులఖాతాల్లో జమచేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు అతి, అనావృష్టిలకు గురై అప్పులు చేసి పంటలు పండిస్తే సరైన గిట్టుబాటు ధర రాక మానసిక క్షోభను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు వెంటనే పెండింగ్‌లో ఉన్న రైతు భరోసాను ప్రతి రైతు ఖాతాలో జమచేయాలని కోరారు.

కోఆర్డినేటర్‌ను తొలగించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా కొనసాగుతున్న శివయ్యను వెంటనే తొలగించాలంటూ జీటీపీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ విజయేందిరకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలను గత డీఈఓ తుంగలో కి తొక్కి జెడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి ఈపోస్టును కేటాయించారని ఆ సంఘం నాయకులు ఆరోపించారు. వెంటనే చర్యల తీసుకోవాలని కోరారు. రఘురాంరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

రేపు ఆధ్యాత్మిక సాంస్కృతిక మహోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: సింహగిరిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట బుధవారం రాత్రి రాష్ట్ర భాషా సాంస్కృతి శాఖ సౌజన్యంతో జనతా సేవాసమితి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నాటక ప్రదర్శన, సామూహిక లింగాష్టకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరకవుల నరహరిరాజు దర్శకత్వంలో నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై నాటకాన్ని వీక్షించాలని వారు కోరారు.

లోకిరేవులో మార్మోగిన శివ నామస్మరణ



నవాబుపేట: మండలంలోని లోకిరేవు వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం శివ నామస్మరణ మార్మోగింది. సోమవారం శివ మాలధారులు దేవాలయంలో జ్యోతిర్లింగ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం శివలింగ పడిపూజ చేశారు. ఈపూజలో మాజీ సర్పంచ్ వెంకటేష్, గురుస్వాములు వీరన్న, రమేష్, ప్రభు, వెంకటేష్, సత్యం పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 20వ డివిజన్‌లోని ఎంప్లాయీస్ కాలనీలో, వీరన్నపేట, పెద్ద శివాలయం, మధురానగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్ల పనులను మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ పరిశీలించారు. ఈ పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కేతేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. మాజీ కౌన్సిలర్లు ఎ.అంజయ్య, జాజిమొగ్గ నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, ఖలీల్ పాషా, లక్ష్మణ్‌నాయక్, అంజద్, రఘు పాల్గొన్నారు.

దేవాలయాలకు భారీగా విరాళాలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాయల పునర్నిర్మాణం, శిఖరాల నిర్మాణం కోసం భక్తులు భారీగా విరాళాలు అందజేశారు. ఇప్పటికే దేవాలయంలో పనులన్ని పూర్తికాగ త్వరగా కలశాల ప్రతిష్ఠాపన జరగనుండడంతో భక్తులు పెద్ద ఎత్తున విరాళాలను దేవస్థాన కమిటీకి అందిస్తున్నారు. సోమవారం బూనేటి చెన్నరెడ్డి భార్య అంజలమ్మ కుమారుడు విజయభాస్కర్‌రెడ్డి, సునీత దంపతులు రూ. 1,00,116ను దేవస్థానానికి అందజేశారు. గుబ్బ వీరన్న, జి.పద్మమ్మ కుమారులు గోపాలకృష్ణ, వెంకటేష్, చంద్రమోహన్ రూ.51,116, హైదరాబాద్ జట్రం రాములమ్మతో పాటు మరికొందరు దాతలు విరాళాలు అందించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, చల్మారెడ్డి, ఆది హన్మంతరెడ్డి, వీరారెడ్డి, పూజారులు నాగరాజుస్వామి, నాగభూషణంస్వామి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



జడ్చర్ల టౌన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని పోచమ్మగడ్డతండా వద్ద ఉన్న ఎస్సీ గురుకుల (బాలానగర్) పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్‌రూంలను ఆయన పరిశీలించారు. స్టోర్‌రూంలో స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నిత్యం అందిస్తున్న మెనూ తెలుసుకొని విద్యార్థులతో మాట్లాడారు. భోజనం ఎలా పెడుతున్నారని ఆరా తీశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్ ఉన్నారు.